



పిడుగురాళ్ల అగ్నిమాపక కేంద్రంలో పాడుపడటంతో ప్రక్కన పడేసిన వాహానం

101 ఫైర్‌స్టేషన్ నెంబరు

108 వైద్య సహాయానికి టోల్‌ఫ్రీ నెంబరు



అగ్గిరేగితే.. ఆర్పేదెలా?

అరకొరగానే అగ్నిమాపక సేవలు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రతిపాదనలకే పరిమితం

ప్రభుత్వ నిబంధనల మేరకు 50 వేల జనాభాకు ఒక శకటం అవసరం. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదు. పది పదిహేనేళ్ల క్రితమే అగ్నిమాపక కేంద్రాలతో పాటు, ఉన్న వాటిలో రెండో శకటం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కొత్తగా కేంద్రాల మంజూరును పక్కన పెడితే ఫైర్ ఇంజన్ల ఊసే లేదు. దీంతో వేసవిలో అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో మంటల్లో ఆస్తులు మసవుతున్నాయి. ఆ సమయాల్లో నాయకులు, అధికారులు కంటి తుడుపు చర్యగా బాధితులకు సాయం అందించి చేతులు దులుపుకుంటున్నారే కానీ అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కనీస ప్రయత్నాలు చేయడంలేదు.



తెనాలిలో మరమ్మతులతో మూలన పడ్డ అగ్నిమాపక యంత్రం

ఎండా కాలం.. అంటే మండే కాలం. అగ్ని ప్రమాదాలకు అత్యధికంగా అవకాశం ఉన్న సమయం. భానుడి భగభగలకు తోడు అగ్గి సులభంగా రేగుతుంటోంది. ఏటా అగ్ని ప్రమాదాల్లో రూ.కోట్ల లో ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలు కూడా పోతుంటాయి. అగ్ని ప్రమాదాల నివారణకు అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చిన వాటిని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అనేందుకు జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. అగ్గి రేగితే ఆస్తులు బుగ్గి అవుతున్నా.. అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేయడంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదనేందుకు సిబ్బంది, సౌకర్యాల కొరత, మరమ్మతులతో మొరాయించే ఫైర్ ఇంజన్లు నిదర్శనంగా కనిపిస్తాయి. జిల్లా, మున్సిపల్ కేంద్రాలు తప్పించి మరెక్కడా కూడా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అవి కూడా అత్యాధునికంగా ఉన్నాయా అంటే అనుమానమే. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలు.. ఏళ్ల క్రితం కేటాయించిన ఫైర్ ఇంజన్లతో అరకొర సేవలతో కాలం వెళ్లదీస్తున్నాయి. అగ్నిమాపక కేంద్రం పరిధిలో పదుల కిలోమీటర్ల దూరంలో జరిగే ప్రమాదాలకు వాహనాలు వెళ్లే సరికి ఆస్తులు బుగ్గవుతున్నాయంటే జిల్లాలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- మరమ్మతుల్లో పలు అగ్నిమాపక శకటాలు
- మండలాలకు సుదూరంలో అగ్నిమాపక కేంద్రాలు
- సకాలంలో ప్రమాదస్థలికి చేరుకోలేకపోతున్న ఫైర్‌ఇంజన్లు
- అగ్నిమాపకశాఖను వెంటాడుతున్న సిబ్బంది, సౌకర్యాల కొరత

ఆస్తులు.. బూడిదే

ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శకటం చేరేసరికి పూర్తి నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో అనేక మండలాల్లో ఫైర్‌ఇంజన్ అందుబాటు లో లేదు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అంది వారు అక్కడకు వెళ్లేప్పటికి మంటల్లో ఆస్తులు బూడిదగా మారుతున్నాయి. ఎక్కడైనా ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో మంటలు అంటుకుంటే ఒకటి పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి కూడా నెలకొంది.

వేధిస్తోన్న సిబ్బంది కొరత

అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్లు ముగ్గురు, ఫైర్‌మెన్లు 9 మంది, డ్రైవర్లు ముగ్గురు, ఒక స్టేషన్ ఆఫీసరు ఉండాలి. అయితే ఏ స్టేషన్లోనూ 40 శాతం మంది సిబ్బంది కూడా లేరు. ఈ పరిస్థితుల్లో అగ్నిమాపకే కేంద్రానికి సమాచారం అందిస్తే.. అది చేరుకునేలోగా నష్టం జరిగిపోతుంది. ప్రమాద స్థలికి చేరుకోవడంలో కీలకంగా ఉండే డ్రైవర్లు ఏ స్టేషన్ లోనూ లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏళ్లుగా సిబ్బంది భర్తీకి నోచుకోలేదు. తాత్కాలిక ప్రాతిపదికన హోమ్ గార్డులను తీసుకున్నా వారికి పని నేర్పుకోలేక అధికారులు సతమత మవుతున్నారు.

సమర్థంగా ఎదుర్కొంటాం

జిల్లాలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కాల్ వచ్చిన కొన్ని నిమి షాల్లోనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండరాదు.

- ముక్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, గుంటూరు



తెనాలిలో పునాదులకే పరిమితమైన అగ్నిమాపక కేంద్ర నిర్మాణం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 9: వేసవి అగ్ని ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉండేకాలం. అయితే జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను వంద శాతం నివారించలేని విధంగా ఉంది. జిల్లాలోని పలు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. దీంతో ప్రమాదాల సమయంలో అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. పలు కేంద్రాల్లో నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ప్రమాదం జరిగిందన్న సమాచారం వస్తే నీటి కోసం, డ్రైవర్ కోసం అన్వేషణ చేయాల్సిన పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం కాదు. ప్రమాదాలకు, దూరాన్ని బట్టి అగ్నిమాపక కేంద్రాలు లేవు. ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నా సమస్యలతో వెంటాడుతున్న అగ్నిమాపక శాఖ వాటిని కాపాడలేకపోతోంది. అత్యంత కీలకమైన అగ్ని మాపక శాఖను ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. వాహనాల మరమ్మతులకు అగ్ని మాపక శాఖ నుంచి నిధులు విడుదల కావడం లేదు. జిల్లాలో ఏ మూల ఏ ప్రమాదం జరిగినా ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఫైర్ ఇంజన్ వెళ్లడానికే చాలా సమయం పడుతోంది. తగినన్ని ఫైర్ స్టేషన్లు, వాహనాలు లేక, సిబ్బంది లేక ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన అగ్నిమాపక శాఖే ప్రమాదంలో ఉంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అగ్ని మాపక శాఖపై పాలకులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

18 మండలాలు.. ఐదు ఫైర్‌స్టేషన్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 18 మండలాలు 575 గ్రామాలు ఉండగా ఐదు చోట్ల అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఫైరిస్క్, వీఐపీ జోన్ పరిధి ఈ జిల్లాలో ఎక్కువగా ఉంది. రాష్ట్ర సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, ఇతర రాష్ట్ర కార్యాలయాలు జిల్లాలోనే ఉన్నాయి. ఇవికాక ఆసియాలోనే పెద్దదైన మిర్చి యార్డుతో పాటు పెద్దసంఖ్యలో శీతల గిడ్డంగులు, వ్యాపార సంస్థలు, ఎన్నో పరిశ్రమలు ఇక్కడే ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగినా గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరిల నుంచి ఫైర్‌ఇంజన్లు వెళ్లాల్సి వస్తోంది. ఆయా కేంద్రాల నుంచి దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు వాహనాలు చేరుకునే లోపే నష్టం జరిగిపోతుంది. జిల్లాలో ఫైర్‌స్టేషన్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది జరిగిన ప్రమాదాల్లో రూ.83.98 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా, రూ.13.80 కోట్ల ఆస్తి నష్టాన్ని అగ్నిమాపక శాఖ నివారించింది.

ప్రమాదాల సంఖ్యలో మార్పు లేదు..

జిల్లాలో ఎక్కువ భాగం పట్టణ ప్రాంతమే అయినప్పటికీ అగ్ని ప్రమాదాలు మాత్రం ఎక్కువగా నే జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు సీరియస్ ప్రమాదాలు 3, మధ్యస్థ ప్రమాదాలు 38, చిన్న ప్రమాదాలు 435 జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాల సంఖ్య కాస్త తగ్గినా ముప్పు మాత్రం నిరంతరం పొంచి ఉంది. జిల్లాలో అగ్నిమాపక శాఖకు 60 వాహనాలు మంజూరు కాగా వాటిలో 51 కండీషన్‌లో ఉన్నాయి. వీఐపీ జోన్ ఎక్కువగా ఉండటం వల్ల వాహనాల సంఖ్యను పెంచి, గ్రామీణ ప్రాంతాలకు దగ్గరలో ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రస్తుతం జిల్లాకు 138 పోస్టులు మంజూరు కాగా 103 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు.

తెనాలి అగ్నిమాపక కేంద్రం గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఏడు మండలాలకు సేవలందిస్తున్నది. సిబ్బంది, వాహన కొరత ఉంది. రెండు అగ్నిమాపక వాహనాల్లో ఒకటి ఏడేళ్ల క్రితం మూలనపడింది. ఒక్క వాహనంతోనే సిబ్బంది అత్యవసర సేవలు అందిస్తున్నారు. లంక గ్రామాల్లో వరదల సమయంలో ఆదుకునేందుకు కేటాయించిన రీస్క్యూ బోటు మరమ్మతులకు గురైంది. 2018 నుంచి పునాదులకే అగ్నిమాపక కేంద్ర భవనం పరిమితమైంది. దీంతో రేకుల షెడ్డులో అగ్నిమాపక కేంద్రం కొనసాగుతుంది.



గుంటూరు కలెక్టరేట్‌లో ఫైర్ ఇంజన్



వినుకొండ ఫైర్ స్టేషన్‌లో కాలం చెల్లిన ఫైర్ ఇంజన్

మీ పంట.. ఈ-పంటలో ఉందా!

అభ్యంతరాలకు అవకాశం



ఈ-పంట నమోదు జాబితాను ప్రతి రైతు పరిశీలించవచ్చు. అందులో నమోదైన వివరాలు సక్రమంగా లేకపోతే అభ్యంతరం తెలపవచ్చు. అభ్యంతరాలు స్వీకరించి జాబితాను సరి చేస్తాం. రైతులు సాగు చేసే పంట వివరాలు ఈ-పంటలో నమోదు చేయించుకోవడం తప్పనిసరి. దానివల్ల విపత్తుల సమయంలో రైతులు పరిహారం అందుకోవచ్చు. - శ్రీనివాసరావు, ఏడీఏ, గుంటూరు

- రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి సామాజిక తనిఖీ
- ముసాయిదా జాబితా తయారు చేసిన వ్యవసాయశాఖ
- తప్పులపై అభ్యంతరాలు స్వీకారం.. 22న తుది జాబితా విడుదల

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన రామారావు అనే రైతు పొగాకు సాగు చేశారు. ఈ-పంటలో శనగ అని నమోదైంది.

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్ల చెరువుకు చెందిన హనుమంతరావు ఐదెకరాల్లో మిరప సాగు చేయగా రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు ఈ-పంటలో నమోదు చేశారు.

బాపట్ల జిల్లా బాపట్ల మండలం కంకటపాలెంలో శ్రీనివాసరావు అనే రైతు పంట సాగు చేస్తే ఆ పొలం వెంకయ్య సాగులో ఉన్నట్లు నమోదైంది.

ఇలాంటి పొరపాట్లు వల్ల రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. విపత్తులు సంభవించినప్పుడు రైతులకు రావాల్సిన నష్ట పరిహారం, పంటల బీమా రాకుండా పోతుంది. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసింది. ఒక వేళ ఈ-పంటలో తప్పులు నమోదైతే అప్పటికప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశం రైతులకు కల్పించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 858 రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు వివరాలు సోమవారం వెల్లడిస్తారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేసిన పంటను వ్యవసాయ సిబ్బంది సక్రమంగా నమోదు చేశారా.. లేదా అన్న విషయాన్ని పరిశీలించుకోవచ్చు. ఒక వేళ తప్పులు ఉంటే అక్కడికక్కడే అభ్యంతరం పత్రం అందజేయవచ్చు. వ్యవసాయ సిబ్బంది అభ్యంతరాలను సరిచేసి మండల అధికారులతో ఆమోదింపచేస్తారు. తహసీల్దారు, వ్యవసాయ శాఖాధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో వెల్లడిస్తారు.



అంతా తప్పుల తడకలే...

ఈ-పంట నమోదు ప్రక్రియ 2016 నుంచి జరుగుతుంది. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పొలంలోకి వెళ్లి రైతు ఏ పంట వేశారో పరిశీలించి ఈ-పంటలో నమోదు చేయాలి. ఆ తర్వాత గ్రామసభ నిర్వహించి జాబితాలను ప్రదర్శించాలి. అయితే గత జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామ సభలు జరగలేదు. వ్యవసాయ సిబ్బంది కార్యాలయంలో కూర్చుని ఏదో ఒక పంటను నమోదు చేశారు. జియో ట్యాగింగ్‌ను కూడా ఫార్స్‌గా మార్చారు. రెవెన్యూ సిబ్బంది అసలు ఈ ప్రక్రియలోనే పాల్గొనలేదు. ఫలితంగా ప్రకృతి విపత్తుల కాలంలో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జగన్ ప్రభుత్వ నిర్వాకంపై కేంద్ర వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు కూడా వెళ్లాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమై గతంలోలా తప్పులు దొర్లకుండా వాటిని సరి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసి అమలుకు రంగంలోకి దిగారు. సామాజిక తనిఖీ జరిగితేనే లోటుపాట్లు వెలుగులోకి వస్తాయన్న ఆలోచనతో రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట జాబితాలు ప్రదర్శించే ఏర్పాటు చేశారు.

గుంటూరుకు 100 ఎలక్ట్రిక్ బస్సులు

- ఆర్టీసీ గ్యారేజిలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు
- ఎన్టీఆర్ బస్టాండ్ ఆధునికీకరణకు ప్రణాళికలు
- బస్టాండ్‌లో పరిశీలన.. పారిశుధ్యంపై అసహనం
- ప్రయాణికులు, సిబ్బందితో పెమ్మసాని మంతనాలు



బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి, మంగళగిరికి వేర్వేరుగా ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు కాగా గుంటూరుకి 100 కేటాయించినట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. విజయవాడ బస్టాప్‌లో, ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో పెమ్మ సాని ప్రయాణికులతో మాట్లా డారు. బస్టాండ్ లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఏమైనా సదుపాయాలు కావాలా అని వారిని ప్రశ్నించారు. మరుగుదొడ్లతో పాటు ప్రాంగ ణంలో అధ్వాన పారిశుధ్యంపై అసహనం వ్యక్తం చేశారు. కార్గో పార్సిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన బుకింగ్ కౌంటర్ వద్ద క్యూలో ఎక్కువమంది ఉండటంతో మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (సోమవారం)
సహరి : 5.03 (మంగళవారం)

నష్టాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది..

బస్టాండ్ పరిశీలన అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చే ఎలక్ట్రిక్ బస్సులతో వచ్చే నష్టాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం గ్యారేజిలో చార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తేవాల్సి ఉందన్నారు. దీనిపై ఇప్పటికే ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. ఐదెకరాల్లో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయగా మిగిలిన 15 ఎకరాల్లోని బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్, ఆర్టీసీ ఈడీలు రవివర్మ, నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్, డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ కేవీఎల్ఎన్ మూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి ఆళ్ల హరి, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఏడుకొండలు, చిలకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నమ్మితే వెన్నంటి ఉండే ఏసయ్య

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, అధ్యక్షుడు అబ్రహం
- ముగిసిన గుడారాల పండుగ

అమరావతి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నమ్మిన విశ్వాసుల జీవితాల్లో స్వస్థత చేకూర్చి కష్టాల నుండి విముక్తి పరిచేందుకు ఏసయ్య తోడుగా ఉంటారని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ తెలిపారు. హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో నాలుగు రోజులుగా జరు గుతున్న 48వ గుడారాల పండుగ ఆదివారంతో ము గిసింది. మధ్యాహ్నం జరిగిన చివరి ప్రార్థనలకు విశ్వాసులు, దైవజనులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడుతూ స్వస్థత, కల్మషంలేని విశ్వాసులపై ప్రభువు ఆశీర్వచనం ఉంటుందన్నారు. ప్రభువును నమ్మి చేసే ప్రార్థనలు కుటుంబ సమేతంగా ఉండాలన్నారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం మాట్లా డుతూ దయాక్షేత్రంలో దైవజనుల వాఖ్యలు విని నాలుగు రోజుల పాటు దేవుని సేవలో గడిపిన ప్రతిఒక్కరి వెంట ప్రభువు తోడుగా ఉంటారన్నారు. రానున్న రోజుల్లో దయా క్షేత్రం మరింత అభివృద్ధి చెంది ప్రపంచస్థాయి గుర్తింపు పొందుతుం దన్నారు. విశ్వాసులందరి సహకారంతో రానున్న గుడారాల పండుగకు మరి న్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. హోసన్న బ్రదర్స్, సిస్టర్స్, పాస్టర్ రమేష్ ఆలపించిన స్తుతి గీతాలతో విశ్వాసులు తన్మయత్వం చెందారు. నైజీరియా, సౌతాఫ్రికా తదితర దేశాలతో పాటు, దక్షిణాది రాష్ట్రాల నుంచి దైవజనులు, తెలుగు రాష్ట్రాల నుంచి విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





చివరి రోజు ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

మేరిమాత అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుంది



పీఠాధిపతి డాక్టర్ భాగ్యయ్యకు ఘన సత్కారం

మాచర్ల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మేరిమాత అనుగ్రహం భక్తులకు ఎల్లవేళలా ఉంటుందని గుంటూరు పీఠాధిపతి (బిషప్) డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో సాగరమాత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో భక్తులకు దైవ సందేశం అందించారు. ఆధ్యాత్మిక ఆయుధాలైన ప్రార్థన, ప్రేమ, నీతి, కరుణ, దయ, క్షమా గుణం కలిగిన వ్యక్తులు దేవుని మార్గంలో నడుస్తారని వివరించారు. శత్రువును సైతం ప్రేమించాలని, తద్వారా మోక్షం లభిస్తుందన్నారు. విజయపురిసౌత్‌కు చేరుకున్న పీఠాధిపతి భాగ్యయ్యను ప్రత్యేక వాహనంలో ఆలయం వద్దకు బాణసంచా, బ్యాండు మేళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఘనంగా సత్కరించారు. వేడుకలలో జిల్లా క్రైస్తవ గురువులు, కన్యస్త్రీలు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఏకోటూరిజంలో సేంద్రియ ఉత్పత్తులతో రెస్టారెంట్



రెస్టారెంట్ లోపల ప్రాంతం

బాపట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకోటూరిజం (ప్రకృతి క్షేత్రం) పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఆహ్లాదాన్ని పంచే చల్లటి వాతావరణంలో ఏర్పాటైన ఈ టూరిజం స్పాట్‌లో సేంద్రియ వ్యవసాయోత్పత్తులతో తయారు చేసే వంటకాలను పర్యాటకులకు అందుబాటులోకి తెస్తున్నారు. ఇక్కడ ఉన్న రెస్టారెంట్‌లో ఈ ఉత్పత్తులను సోమవారం నుంచి పర్యాటకులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఏర్పాటు చేసిన అటవీ అభివృద్ధి సంస్థ ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆత్మీయ విందును ఏర్పాటు చేసేలా సేంద్రియ వ్యవసాయోత్పత్తులతో రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వసతి గృహాలను వినియోగించుకునే పర్యాటకుల కోసం దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ ఎ.గీతిక తెలిపారు. నీడనిచ్చేచెట్ల కింద పర్యాటకులు సేదతీరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక్కడ నుంచి సముద్ర తీరానికి పర్యాటకులను తీసుకెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెస్టారెంట్‌లోపూర్తి స్థాయి సేంద్రియ వంటకాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఆర్ క్లబ్ కోశాధికారి మక్కెన నరసింహారావు

చిలకలూరిపేట, మార్చి9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో మూడు రోజులపాటు జరిగిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో రెండు జిల్లాల నుంచి మొత్తం 51 టీంలు పాల్గొన్నాయి. మెన్ డబుల్స్ విభాగంలో 35, 45, 55, 65 ప్లస్ ల వారికి ఈ పోటీలు నిర్వహించారు. బహుమతులను చిలకలూరిపేట కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు సమకూర్చారు. విజేతలకు సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కోశాధికారి మక్కెన నరసింహారావు బహుమతులు అందజేశారు. 35 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా చిలకలూరిపేట, రన్నర్స్‌గా నరసరావుపేట జట్లు గెలుపొందాయి. 45 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా తెనాలి, రన్నర్స్‌గా గుంటూరు జట్లు, 55 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా గుంటూరు, రన్నర్స్‌గా చిలకలూరిపేట జట్లు, 65 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా కనిగిరి, రన్నర్స్‌గా చిలకలూరిపేట జట్లు విజయం సాధించాయి.

దిగుబడి పెరిగింది.. ధర తగ్గింది

● హెచ్చుతగ్గులతో పచ్చిమిర్చి రైతులకు కష్టాలు



బాపట్ల నియోజకవర్గంలో పచ్చిమిర్చి తోటలు

బాపట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి సాగుకు ప్రసిద్ధి గాంచిన బాపట్ల నియోజకవర్గంలో ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా కనిపించటంలేదు. వాతావరణం సాగుకు అనుకూలించటంతో ఉత్పత్తులు బాగా పెరిగాయి. అయితే ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవటంతో రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తుంది. అత్యధికంగా కర్లపాలెం మండలంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎంవీరాజుపాలెం, ఏట్రవారిపాలెం, నల్లమోతువారిపాలెం, యాజలి, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో పచ్చిమిర్చిసాగు చేస్తుంటారు. బాపట్ల మండలంలోని నందిరాజుతోట, కొండుభొట్లపాలెం, పిన్నిబోయనవారిపాలెం, పడమరబాపట్ల, వెదుళ్ళపల్లి, బేతపూడి, స్టూవర్టుపురం తదితర ప్రాంతాలలో పచ్చిమిర్చిసాగు చేస్తున్నారు. చెరుకుపల్లి మండలంలోని రాంభొట్లపాలెం పరిసర ప్రాంతాలో పచ్చిమిర్చిసాగు ఉంది. చీరాల మండలంలో ఈ ఏడాది తోటవారిపాలెం గ్రామంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 1145, 5005, జెర్సీ-56, 684 వంటి రకాలు ఎక్కువగా విత్తారు. వీటి ధర ప్రస్తుతం కేవలం కిలో 8 రూపాయలు మాత్రమే ఉంది. ఒక్క ఈషా రకం మాత్రమే కిలో 22 రూపాయలు పలుకుతుంది. ఈ వైరటీ కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు. సుమారు 1500 ఎకరాలలో రైతులు మోటర్ల సాయంతో గరువు మెరక భూములలో పచ్చిమిర్చి సాగు అనాదిగా చేస్తున్నారు. ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ. 70 వేల వరకు కౌలు చెల్లించి మరి సాగు చేస్తున్నారు. ఈషారకం రెండు కోతలు మాత్రమే వస్తుంది. మిగిలిన రకాలు నాలుగు కోతలు వస్తాయి. అయినప్పటికీ ధర లేకపోతే పెట్టుబడితోపాటు కూలీల ఖర్చు పెరిగిపోయి నష్టాలు చవి చూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చిమిర్చి హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో పచ్చిమిర్చి మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే అది ఆచరణకు నోచుకోకపోవటం వల్ల దళారులకు విక్రయించి రైతులు నష్టపోతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆశించిన మేర ధరలేదు



పచ్చిమిర్చికి ఆశించిన మేరకు ధర లభించటంలేదు. మొదట్లో కిలో 14 రూపాయలు అమ్మినప్పటికీ ప్రస్తుతం 8 రూపాయలకు తగ్గిపోవటం వలన తోటలో కాయలు కోయకుండా ఉంచాం. ఎకరానికి ఒక కోతకు 100 బస్తాలు వరకు దిగుబడి వస్తుంది. మొదటికోత తక్కువగా వచ్చినప్పటికీ, రెండు కోతలు దిగుబడులు ఎక్కువగా వచ్చి నాలుగో కోత తగ్గుతుంది. ఏదో ఒక కోతకు మంచి ధర లభిస్తే నష్టపోకుండా ఖర్చులు వస్తాయి. లేకుంటే నష్టం వాటిల్లుతుంది. ధరలు ఆశాజనకంగా ఉంటే లాభాలు వచ్చే అవకాశం ఉంది.

\- ఎస్.శ్రీనివాసరెడ్డి, పడమర బాపట్ల రైతు

యాలి వాహన రూఢుడైన లక్ష్మీనృసింహుడు

● ముత్యాల పల్లకీపై గ్రామోత్సవం



ముత్యాల పల్లకీ సేవలో లక్ష్మీనృసింహుడు

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు ఆదివారం రెండు వాహనాలపై ఊరేగారు. సాధారణంగా నృసింహుని వాహన సేవలు సాయంకాల వేళల్లో జరుగుతాయి. కైంకర్యం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావడంతో గత కొద్ది సంవత్సరాల నుంచి ఉదయం వేళల్లో కూడా వాహన సేవలు నిర్వహిస్తున్నారు. చిన్న శేష వాహనం, హంస వాహనం, అశ్వ వాహనం, కల్ప వృక్ష వాహన సేవలు ఉదయం పూట జరుగుతున్నాయి. గతేడాది నుంచి ముత్యాల పందిరి వాహన సేవను కూడా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ముత్యాల పందిరి వాహనంపై శ్రీవారు పురవీధుల్లో విహరించారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన అంగా ఉపేంద్ర వర్మ, తేజస్విని దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఉత్సవ విశిష్టతను వివరిస్తూ ముత్యం వలె ఎటువంటి మచ్చలేని శ్వేత వర్ణము కలిగిన ముత్యాల పందిరిలో స్వామివారిని దర్శించుకున్న వారికి రుగ్మతలు, దోషాలు, క్రూరత్వం తొలగిపోయి నృసింహుని కరుణా కటాక్షాలు పొందుతారని తెలిపారు. రాత్రి ఉభయ దేవేరులతో కలిసి యాలి వాహన రూఢుడైన శ్రీవారు తొలుత ఆలయ మాడవీధుల్లో విహరించారు. అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన మురికిపూడి పుష్పవేణి, కుమారులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. అర్చకులు ఉత్సవ విశిష్టతను వివరిస్తూ హింసించే స్వభావం కలిగిన క్రూరులను శిక్షించి, సాధువులను రక్షించగలనని తెలియజేయడానికే యాలి వాహనోత్సవం జరుగుతుందన్నారు. యాలి వాహన రూఢుడైన స్వామివారిని దర్శిస్తే దుర్మార్గుల వలన భయం నశిస్తుందన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, మహిళా భక్త బృందం కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



యాలి వాహనంపై గ్రామోత్సవంలో నృసింహస్వామి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
● మంగళగిరిలో ఘనంగా మహిళా సదస్సు
● బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ
● మహిళా విభాగం అధ్యక్షురాలిగా సరళాదేవి



మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యమని భావించిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో మహిళా సదస్సు నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ఆనాడు ఎన్టీఆర్‌తోపాటు నేడు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దివంగత ఎన్టీఆర్ రాష్ట్రంలో తొలి మహిళా యూనివర్సిటీని నెలకొల్పారని, మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తిలో సగభాగం హక్కును కల్పించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు సైతం మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత కేబినెట్‌లో ముగ్గురు మహిళలకు కీలక శాఖలను అప్పగించడం గొప్ప విషయమన్నారు. త్వరలో నిర్వహించబోయే మెగా డీఎస్సీలో మహిళలకు టీచర్ పోస్టులు లభించేలా ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌ను కూడా ప్రారంభించనున్నారని వెల్లడించారు. అలాగే మహిళల రక్షణకు శక్తి యాప్‌ను రూపొందిస్తున్నారని తెలిపారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్న ఘట్టమనేని సాయిరేవతి, చంద్రిక, సాదియా అల్‌మాస్‌లను మంత్రి సవిత ఘనంగా సన్మానించారు. ముగ్గురు గర్భిణీలకు సీమంతం నిర్వహించి, నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వావిలాల సరళాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గురుకులాల కార్యదర్శి మాధవీలత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, సభ్యులు కుమ్మరి క్రాంతికుమార్, తిరువీధుల కిరణ్, పారేపల్లి మహేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే..

● ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్



సంఘీభావం తెలియజేస్తున్న చిలుకా చంద్రశేఖర్, నవజ్యోతి

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీల కాళ్ల కిందనున్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకే ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సన్నాహక సమావేశం అరండల్‌పేట ఒకటో లైనులోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దండ కారణ్యం ప్రకృతి ఒడిలోనున్న ఖనిజ సంపదలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని ఒప్పందాలు చేసుకుందనీ, అందులో భాగంగానే అడవిలో ఉండే ఆదివాసులను ఖాళీ చేయించాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిలో సైనిక క్యాంపులు పెట్టి ఆదివాసులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతున్నారని ఆరోపించారు. ఆదివాసీలు చేస్తున్న ఉద్యమాలకు సంఘీభావంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ కోలా నవజ్యోతి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో మమేకమై అడవులు, కొండలు, గుట్టలను ధ్వంసం చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తుందని దుయ్యబట్టారు. అడ్డుకుంటున్న ఆదివాసీలను, విప్లవకారులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతూ పచ్చని అడవిలో నెత్తుటి ఏరులు పారిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని, అడవులను, ఆదివాసీలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మూలవాసి ఆందోళన మంచ్‌పై నిషేధం ఎత్తి వేయాలని, మూలవాసి ఆందోళన మంచ్ పేరుతో అరెస్టు చేసిన రఘు తదితరులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్‌గా నవజ్యోతి...

సమావేశం వేదికగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గం ఏర్పాటైయింది. వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్‌గా కోలా నవజ్యోతి, కో-కన్వీనర్లుగా బి.శ్రీనివాస్ నాయక్, వేల్పూరి నరసింహారావు, ఎన్ పోతురాజు, ఉన్నం రాణి, డి.సుధాకర్, ఎన్.నీలాంబరం, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రసాద్ (విరసం), కె.రవిచంద్ర (నిర్బంధ వ్యతిరేక పోరాట కమిటీ) వై. వెంకటేశ్వరరావు (పీడీఎం), బి.కొండారెడ్డి (పీకేఎస్), బి.అంజమ్మ (అమరుల బంధుమిత్రుల సంఘం), పాటిబండ్ల కోటేశ్వరరావు (ప్రజా పోరు), సాదు మాల్యాద్రి (బహుజన పొలిటికల్ సెంటర్) డేన్నిస్ రాయ్ (బహుజన డెమొక్రటిక్ ఫ్రంట్), ఎస్‌కే ఖాజావలి (ముస్లిం హక్కుల పోరాట కమిటీ), కె.కృష్ణ (కేఎన్‌పీఎస్), కోటేశ్వరరావు (సీఎల్‌సీ) ఎస్‌కే మస్తాన్‌వలి (పీడీఎం) తదితరులు ప్రసంగించారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి





పూజలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆలయం వద్దకు వస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, రైతులు, కర్షకులు, కార్మికులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఆదివారం జానపాడు గ్రామంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో తిరునాళ్ల సందర్భంగా పూజా కార్యక్రమాలలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. తొలుత వీరాపురం సమీపంలోని శాంతినగర్ వద్ద శ్రీసాయి తిరుమల బయో ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, గండికోట వెంకటేశ్వర్లు, వున్నం నరసింహారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, వున్నం వెంకట్రావు, కోట శ్రీను, పాల శ్రీను, కూరపాటి కొండలరావు, వున్నం సురేష్, చింతలపూడి రామ్మూర్తి, వెంకటేష్, ఖాశిం, నెల్లూరు శ్రీను, బండ్ల శ్రీను, వేముల తిరుమల కుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణానికి పటిష్ట బందోబస్తు

● ఎస్పీ సతీష్ కుమార్



వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న రాజధానిలోని వెంకటపాలెంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వెంకటపాలెంలోని ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస కల్యాణ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ ప్రదేశాలను, వాహనాల రాకపోకలకు కేటాయించిన మార్గాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వీవీఐపీ, వీఐపీ, భక్తుల వాహనాల రాకపోకలకు సంబంధించి ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్, ఇతర పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ , తుళ్లూరు సీఐలు గంగా వెంకటేశ్వర్లు , అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్ కొద్ది వారాలుగా నిలిచిన విషయం విదితమే. నేటి నుంచి తిరిగి ప్రారంభమవుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నామనీ, ప్రజలు నేరుగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించుకోవడానికి గుంటూరులోని పోలీస్ కార్యాలయానికి రావచ్చని ఎస్పీ తెలిపారు.

జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకులు

రాజుపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వారి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ఆదివారం ప్రారంభమైయ్యాయి. సత్తెనపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, పూజల వెంకట కోటయ్య, పల్లపాటి రాములు, నర్రా మల్లయ్య, మర్రి వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పోటీలలో మొత్తం 6 ఎడ్లజతలు పాల్గొన్నాయి. నాలుగుపళ్ల పందేలలో బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామానికి చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత నిర్ణీత 15 నిమిషాల వ్యవధిలో 5,278.6 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండల పాతమాగులూరుకు చెందిన చీరబోయిన కోటేశ్వరరావు ఎడ్లజత 4250 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్లజత 4000 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరంకు చెందిన దివ్యశ్రీ ఎడ్లజత 3027 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం నిండుజర్లకు చెందిన ఎడ్లజత 2250 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన కూరేటి చినబసవయ్య మెమోరియల్ ఎడ్లజత 1407 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు నగదు బహుమతులతోపాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

జీఎస్‌టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసరావు



చెన్నకేశవులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్. శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్.సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాథంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ముందుగా నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 523.90 అడుగులు ఉంది. ఇది 156.48 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8986, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,999 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	88, 95, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

ఎన్టీఆర్ బస్ షెల్టర్‌ను తొలగించవద్దు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ బస్ షెల్టర్‌ను తొలగించవద్దని ఎన్టీఆర్ స్మారక సేవాసమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణ నేపథ్యంలో ఈ బస్



పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీఆర్ స్మారక సేవా సమితి సభ్యులు

షెల్టర్‌ను తొలిగిస్తున్నారనే ప్రచారం జరుగుతుందని అందుకే పెమ్మసానికి వినతిపత్రం అందజేశామని అన్నారు. బ్రిడ్జి విస్తరణను స్వాగతిస్తున్నామని, కానీ ఈ షెల్టర్‌ను తొలగించవద్దని కోరారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అభ్యసించిన ఏసీ కళాశాల ఎదుట ఆయన పిలుపు మేరకు 1974లో ఈ షెల్టర్‌ను నిర్మించామని గుర్తుచేశారు. స్వయంగా ఎన్టీఆర్ చేతుల మీదగా షెల్టర్‌ను ప్రారంభించారని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సేవాసమితి గౌరవ అధ్యక్షుడు రావిపాటి సత్యనారాయణ, కార్యదర్శి పాశం సాంబయ్య, సభ్యులు కేతేపల్లి సాంబశివరావు, రవికుమార్, దారపనేని శివప్రసాదు తదితరులు ఉన్నారు.

ఆలపాటిని సత్కరించిన డాక్టర్ నిమ్మల

గుంటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను లక్ష్మీపురంలోని ఆయన కార్యాలయంలో టీడీపీ నాయకుడు డాక్టర్ నిమ్మల శేషయ్య



ఆలపాటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిమ్మల శేషయ్య

మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశాడు. ఆలపాటి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా శేషయ్య కోరుకున్నారు.

చదువుతోపాటు నైతిక విలువలు నేర్పించాలి

పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు (విద్య) మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చదువుతోపాటు విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు నేర్పించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. రింగ్ రోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్లో ఆదివారం జరిగిన వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు సెల్ ఫోన్‌లకు బానిసలుగా మారుతున్నారని దీని



ఎమ్మెల్యే గళ్లా మాధవిని సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

నుంచి వారిని దూరం చేసి విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవి సూచించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక బాధ్యత పెంపొందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ దామచర్ల శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్లు మేడేపల్లి రవీంద్రబాబు, సూరా రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత వైస్ ప్రిన్సిపాల్ సీతా మహాలక్ష్మి, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ జరిగింది. వెస్ట్ డీఎస్పీ అరవింద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నగరంపాలెం, పట్టాభిపురం, అరండల్‌పేట స్టేషన్ల రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని సత్ప్రవర్తన కలిగి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఏ చిన్న నేరంలో, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాల్లో పాల్గొంటే కఠినచర్యలు తీసుకోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి అందే పథకాలను నిలిపివేసేలా సిఫార్సు చేస్తామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని ఆయా కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలని సూచించారు.

వీనుల విందుగా శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగ రాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ సంగీత విద్వాంసు లు కోరిడే సుధీర్ శర్మ శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. శ్రీ త్యాగరాజ స్వామి, అనేక వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి సంగీతా భిమానులను అలరించారు.

ఆత్మ ఘోషపై చర్చకు సిద్ధమా?: కనపర్తి



గుంటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎవరి ఆత్మలు ఘోషిస్తున్నాయో బహిరంగంగా చర్చించటానికి తాము సిద్ధంగా ఉన్నామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సవాల్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 సంవత్సరాల తర్వాత అతి కష్టం మీద రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన అంబటికి మంత్రి నారా లోకేశ్ పేరెత్తే అర్హత లేదన్నారు. సొంత బాబాయిని తమ్ముళ్లతో నరికి చంపించిన నీచుడు జగన్మోహన్ రెడ్డి అని వివేకానందరెడ్డి ఆత్మ ఘోషిస్తుంటే.. జగన్ లాంటి దుర్మార్గుడు కుమారుడిగా పుట్టినందుకు తల్లి విజయమ్మ, అన్నగా పుట్టినందుకు చెల్లెళ్ళు షర్మిళ, డాక్టర్ సునీత గుండెలు ఘోషిస్తున్నాయన్నారు. 'అంబటి రాంబాబు లాంటి నీచుడు, దరిద్రుడు తనకు మామ కావటం నా ఖర్మ అని' సొంత అల్లుడు మీడియా వద్ద ఘోషించినది నిజం కాదా అని ప్రశ్నించారు. అంబటి నోరు అదుపులో లేకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కనపర్తి హెచ్చరించారు.

సమాజాభివృద్ధిలో అతివల పాత్ర కీలకం

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో అతివల పాత్ర కీలకమైనదని ప్రముఖ వైద్యులు పువ్వాడ లక్ష్మీ దీపిక, మున్నలూరి రాధ అన్నారు. స్థానిక నల్లచెరువు, సువర్చలా ప్రసన్నాంజనేయ కల్యాణ మండపంలో ఆదివారం వాసవీక్లబ్ మహిళా, వాసవీక్లబ్ యువ క్లబ్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ మహిళా అధ్యక్షురాలు రాయవరపు అనురాధ, విజయ లక్ష్మి, చంద్రిక పాల్గొని అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని వాసవీక్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.



అధ్వానంగా ఉన్న వాకింగ్ ట్రాక్



నిరుపయోగంగా ఓపెన్ జిమ్ వస్తువులు

అధ్వానంగా చుట్టుగుంట పార్కు

● కనీస మౌలిక వసతుల కరువు ● కనిపించని ఆహ్లాదం ● గోడలకు మాత్రం గ్రానైట్‌తో సోకులు ● విస్తుపోతున్న వాకర్స్

గుంటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తింటానికి లేదు కానీ ఊరంతా భోజనాలు పెడతా నన్నాడంట వెనుకడికి ఒకడు ఇలా ఉంది చుట్టుగుంట పార్కులో అభివృద్ధి పనుల తీరు. చుట్టుగుంట పార్కు రాళ్ళు రప్పలు, మట్టికుప్పలతో అధ్వానంగా ఉంటే చుట్టూ ప్రహరీకి మాత్రం గ్రానైట్ రాయితో సోకులు చేస్తుండటం వాకర్స్‌ను విస్తుపోయేలా చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చుట్టుగుంట పార్కును అద్భుతంగా తీర్చిదిద్దుతానంటూ వైసీపీ నేతలు, అధికారులు పెద్ద పెద్ద ప్రకటనలు చేశారు. దీంతో పార్కుకు మహర్దశ పట్టిందిలే అనుకున్నారు. కానీ వాస్తవంలో చూస్తే ఎటువంటి అభివృద్ధి లేకపోగా నిధులను దుర్వినియోగం చేశారన్న విమర్శలు మూటకట్టుకున్నారు. పార్కు చుట్టూత విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అవి కాస్త పార్కు విస్తరణ నేపథ్యంలో జీటీ రోడ్డులో కలిసిపోయాయి. చెరువుకు ఒక వైపు గోడలు నిర్మించి మరో వైపు అలాగే వదిలేశారు. అభివృద్ధి పనుల పేరుతో మొక్కలు తొలగించి ఆహ్లాదం లేకుండా చేశారు. ఇక మహిళలు, చిన్నారులు వినియోగించుకునేలా ఉండే ఓపెన్ జిమ్ వస్తువులను తొలగించి మూలన పడేశారు. అవి కూడా తుప్పపట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. వైసీపీ హయాంలో అప్పటి పాల కులు, అధికారులు వ్యవహరించిన తీరుతో పార్కు అభివృద్ధి మూడు అడుగులు ముందు కు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది.

గ్రానైట్ రాయితో సోకులు..

ఇక చుట్టుగుంట పార్కు పరిస్థితి అధ్వానంగా ఉంటే జీటీ రోడ్డు వైపునకు ఉండే గోడ లకు గ్రానైట్ రాయితో సోకులు చేయటం విమర్శలకు తావిస్తోంది. అవి కాస్త సాయంత్రానికి మందుబాబులకు ఉపయోగపడుతున్నాయన్న విమర్శలున్నాయి. అధ్వానపు వాకింగ్ ట్రాక్, కనీసం ఆహ్లాదం పంచేలా పచ్చదనం లేదు. మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు చెప్పుకోలేని దుస్థితి నెలకొన్నది. దీంతో వాకర్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కు అభివృద్ధికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం శుభపరిణామం

గుంటూరు సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం శుభపరిణామం అని అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమరావతిలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడం వల్ల గన్నవరం విమానాశ్రయం రద్దీ, పర్యావరణ కాలుష్య భారం తగ్గుతుందన్నారు. విమాన సదుపాయం ఉంటే అమరావతికి అంతర్జాతీయ స్థాయిలో రాకపోకలు పెరగటంతో పాటు, పెట్టుబడిదారులు క్యూ కడతారన్నారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, పరిశ్రమలు వచ్చినప్పుడే రాజధానిలో జనసంచారం ఉంటుందన్నారు.

అంగన్వాడీలపై కూటమి ద్వంద్వ వైఖరి : నేతాజీ

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలపై అధికార కూటమి ద్వంద్వ వైఖరి అనుసరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ విమర్శించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా అంగన్వాడీల జీతాల పెంపుదల విషయం పట్టించుకోకపోగా గత సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయం లోనూ తూట్లు పొడుస్తున్నారన్నారు. ఒప్పందంలో మట్టి ఖర్చులు రూ.20 వేలను, రూ.15 వేలకు కుదించి జీవో ఇచ్చారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికై జరిగిన ధర్నాను ప్రభుత్వం అడ్డుకోవడం సరైనది కాదన్నారు.

హెల్త్ కార్డులపై పెన్షనర్లకు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి

గుంటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హెల్త్ కార్డుల సందేహాలకు బాధ్యత వహించే ఉద్యోగశ్రీ ట్రస్ట్ నిర్వహణ లోప రహితంగా ఉండేలా చర్యలు తీసుకొని పెన్షనర్లకు సత్వరం వైద్యం అందించాలని రాష్ట్ర పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి ఒక లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ కార్డులతో ఆస్పత్రికి వెళ్ళినపుడు తాజా డేటా లేకపోవటంతో ప్రీ ఆథరైజేషన్ లభించటం లేదని, దీంతో వైద్యం అందించకుండా రోగులను (పెన్షనర్లను) బయటే వేచి ఉండమని ఆస్పత్రి యాజమాన్యాలు చెప్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఆరోగ్య కార్డులను వినియోగదారుల చట్టం పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. డాక్టర్లు నిర్లక్ష్యం వహించినా, రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లినా నష్టపరిహారం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సర్వర్‌ను పటిష్టం చేసి డేటా అప్డేట్ చేయటం ద్వారా ఉద్యోగశ్రీ పథకం లబ్ధిదారులైన పెన్షనర్లకు ఇబ్బందులు తొలగించాలని వీరయ్య కోరారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు విమర్శించారు. సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం గుంటూరులోని టిడ్కో గృహ సముదాయాలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ లబ్ధిదారులు బ్యాంకు నుంచి రూ.మూడున్నర లక్షలు రుణం తీసు



టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

కుంటే 15 నుంచి 20 ఏళ్ల కాలంలో దాదాపు రూ.పదిన్నర లక్షలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. అసలు కంటే వడ్డీనే అధికంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా ఇల్లు ఇస్తామని చేసిన వాగ్దానం అమలు కాలేదన్నారు. సమస్యలపై ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు నళినికాంత్, కే శ్రీనివాసరావు, బీ లక్ష్మణ రావు, ఆది నికల్సన్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

ఈ నెల 17 వరకు జరిగే ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని, సమస్యలను యాత్ర బృందానికి తెలపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు కోరారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాయలంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ సీపీఎం శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి దశల వారీగా ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వై నేతాజీ, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి తీరని లోటు

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) మృతి తీరని లోటని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. బాలకృష్ణ ప్రసాద్ గుండెపోటుతో ఆదివారం సాయంత్రం స్వగృహంలో కన్నుమూశారని అన్నారు. ఆయన వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన చేశారన్నారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా గరిమెళ్ల విశేష సేవలందించారన్నారు. సంప్రదాయ కర్ణాటక, లలిత, జానపద సంగీతంలోనూ గరిమెళ్ళ ప్రసిద్ధులు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు శ్రీధర్ శర్మ తెలిపారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభ వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

భాగంగా ఆదివారం ఉదయం గోపూజ, గణపతి పూజ, శ్రీచక్రమేరుకు విశేష అభిషేకాలు అర్చనలు జరిగాయి. అనంతరం కల్యాణాల్లో భాగంగా శ్రీధైర్య లక్ష్మి నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. కార్యక్రమాల్ని ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు పర్యవేక్షించారు.

సామూహికంగా సర్క్యూట్ డివైజ్ బోర్డు రూపకల్పన

● తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు

గుంటూరు(విద్య), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఆదివారం సుధర్మ ఆడిటోరియంలో సుగుణ సైన్స్ అకాడమి ఆధ్వర్యంలో 'ఎలైట్ అండ్ ఎనర్జిటిక్ మైండ్స్'



సర్క్యూట్ బోర్డు తయారు చేసిన విద్యార్థులు

పేరుతో కార్ రివర్స్ చేసే సమయంలో ఉపయోగించే అలారంతో కూడిన ఎలక్ట్రానిక్ డివైజ్ ను తయారు చేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌తో పాటు వెంకటకృష్ణాపురంలోని సిద్దార్థ హైస్కూల్‌కు చెందిన 6, 7, 8, 9 తరగతులు చదువుతున్న 220 మంది విద్యార్థులతో ఒకే వేదికపై సామూహికంగా సర్క్యూట్ బోర్డు ద్వారా డివైజ్‌లను రూపొందించారు. కార్యక్రమంలో సుగుణ సైన్స్ అకాడమీ సీఈవో డాక్టర్ చివుకుల సాంబశివరావు, పరిశీలకుడు పత్రి వేణుగోపాల్ డివైజ్‌లను తయారు చేసిన విద్యార్థులు చివరి దశలో వాటికి బ్యాటరీని అమర్చి, అలారంలను మోగించారు. దీంతో తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించారని కార్యక్రమాన్ని ఆద్యంతం పర్యవేక్షించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ బోడేపూడి రామారావు ప్రకటించారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గుంటూరు మెడికల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ బాధ్యతల్లో అత్యంత కీలక పాత్ర పోషించే మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధపెట్టాలని గైనకాలజిస్ట్ డాక్టర్ డి పద్మజ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆదివారం మహిళలకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె ప్రసంగించారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలను అశ్రద్ధ చేయ కుండా చికిత్సలు పొందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వోలో పని చేసే మహిళా సిబ్బంది పీ నిర్మలరాణి, మల్లేశ్వరి, లీలావతి, పావని, జ్యోతిక, బేబీ మాలిని, నర్సమ్మలతో పాటు రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ, డాక్టర్ పద్మజ, డిజిటల్ డిజైనర్ జ్యోతి, హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ శ్రీలేఖ, లక్ష్మీసామ్రాజ్యంలకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

12న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టం రక్షణ - వ్యవసాయ కార్మికుల డిమాండ్ సాధన కోసం ఈ నెల 12న విజయవాడలో మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, బీ కోటేశ్వరి, జీ అజయ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1211 కేసుల పరిష్కారం

ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1211 కేసులు పరిష్కారమైనట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈనెల 8న దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన వివిధ కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. మద్యం అక్రమంగా కలిగి ఉండడం, అమ్మకం, రవాణాకి సంబంధించిన ఎక్సైజ్ కేసులు 473, పేకాట, కోడి పందాలు, లాటరీలకు సంబంధించి 133 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులను, పోలీసు అధికారులు, న్యాయాధికారులతో సమన్వయం చేసిన డీసీఆర్‌బీ-2 సీఐ నరసింహారావు, వారికి సహకరించిన కోర్టు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 14 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య ఆది



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం

వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 11న అంకురారోపణ, 12న శ్రీవారి దివ్యశాంతి కల్యాణోత్సవం, 13న స్వామి వారి రథోత్సవం 14న చండీ హోమం, పూర్ణాహుతి, అన్న సమారాధన, శ్రీ పద్మావతి అమ్మవారికి విశేష అభిషేకాలు, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఐటీ పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

గుంటూరు (విద్య) మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచి నైపుణ్యాలు పెంచేలా పరిశ్రమల అవసరాల కనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్మార్ట్ బ్రిడ్జి వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి సిరా అన్నారు. చౌడవరం లోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్న్‌షిప్, శిక్షణ కార్యక్రమాల గురిం చి ఆమె మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రధానంగా చదువు తోపాటు పరిశ్రమలకు అవసర మైన శిక్షణపై దృష్టి సారించాలని సూచించారు. స్మార్ట్ బ్రిడ్జి జిల్లాలోని కళాశాలలతో ఎంవోయూ ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు అవసరమైన శిక్షణకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం నుంచి పరిశ్రమల యాజమాన్యాలను తరగతుల్లో పాల్గొనేలా చేసి వారి పరిశ్రమలకు అనుకూలంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి, ఉపాధి కల్పనా ధికారి మాధవరావు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), మార్చి 9(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్ష రాసే బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖాధికారి కే మయూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పాసైన అభ్యర్థులకు మాత్రమే ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు పది, టీటీసీ లేదా బీఎడ్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించరాదు) ఆధార్, రెండు ఫొటోలతో గుంటూరు రాజాగారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో (0863-2358071) సంప్రదించాలని సూచించారు. ఈనెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

12న 'యువత పోరు'తో వైసీపీ నిరసన

గుంటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలపై కూటమి ప్రభుత్వం విఫలమైందంటూ ఈనెల 12న వైసీపీ యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలతో వైసీపీ నేతృత్వంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని కలెక్టరేట్ల ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి వైసీపీ శ్రేణులు ప్రదర్శన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్లకు సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని అన్నారు.

పిల్లలు పుట్టడం లేదని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సంతానం కలగడం లేదనే కారణంగా ఏటుకూరుకు చెందిన ఏపూరి బాజీ బాబు (31) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాజీ బాబు ఓ ప్రముఖ పచ్చళ్ళ కంపెనీలో పని చేస్తుంటాడు. 11 ఏళ్ల క్రితం బాజీ బాబుకు శిరీషతో వివాహమైంది. అయితే సంతానం కలగడం లేదని మనస్థాపానికి గురై ఈ నెల 7న లాల్‌పురం శివారు ఖాళీ ప్లాట్లలో పురుగుల మందు తాగాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందాడు. దాసరిపాలేనికి చెందిన నాసరి నరేంద్ర, మంజుల దంపతులు చిన్న కుమారుడు షణ్ముఖ కుమార్‌ను తీసుకొని ద్విచక్ర వాహనంపై గుంటూరులో సరుకులు కొనుగోలు చేసేందుకు బయలుదేరారు. వారు జాతీయ రహదారిపై టయోటా షోరూం సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారి ద్విచక్ర వాహనం డివైడర్‌కు ఢీకొనడంతో షణ్ముఖ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నరేంద్రకు గాయాలయ్యాయి. తల్లి మంజుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిక్సూచి
DIKSUCHI

విదేశీ భాషా కోర్సులు ఇక్కడ చదవొచ్చు



భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదు. ఆధునిక కాలంలో అది కెరీర్ కూడా. మాతృభాషతోపాటు విదేశీ భాషలు నేర్చుకుని అద్భుతమైన కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎక్కువ భాషలు వస్తే అన్ని అవకాశాలు పెరుగుతాయి కూడా. భారతదేశంలో విదేశీ భాషలను ప్రైవేటు సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా అందిస్తున్నాయి. ఇందులో బిగినర్ కోర్సులు, ఇంటర్మీడియెట్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు, స్పెషలైజ్డ్ కోర్సులు ఉంటాయి. బిగినర్ కోర్సులు కొంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తే ఇంటర్మీడియెట్ కోర్సులు భాషా పరిజ్ఞానాన్ని పెంచుతాయి. అడ్వాన్స్‌డ్, స్పెషలైజ్డ్ కోర్సులు అయితే కెరీర్‌కు కావాల్సిన భాషా సంపదను కలిగిస్తాయి. మన దేశంలో భాషకు సంబంధించి కోర్సులు అందించే ప్రభుత్వ వర్సిటీల్లో కొన్ని....

ఢిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, పర్షియన్, మోడరల్ అరబిక్, పాలీ, టిబెటన్ భాషా - సాహిత్యంలో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. https://www.du.ac.in/

బనారస్ హిందూ యూనివర్సిటీ: పలు విదేశీ భాషలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను బనారస్ హిందూ యూనివర్సిటీ అందిస్తోంది. ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, చైనీస్ భాషలు ఇందులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. https://www.bhu.ac.in/

గురునానక్‌దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్: ఈ వర్సిటీలో ఫ్రెంచ్‌లో ఫుల్‌టైమ్ డిప్లొమాలు, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్ భాషల్లో పార్ట్‌టైమ్ డిప్లొమాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్రెంచ్‌లో పార్ట్‌టైమ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కూడా అందుబాటులో ఉంది. వీటికి దరఖాస్తు చేయడానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. https://www.gndu.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ: భాషలకు సంబంధించిన పలు కోర్సులను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. జర్మన్, రష్యన్, స్పానిష్, జపనీస్, కొరియన్, చైనీస్ తదితర భాషలకు సంబంధించిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ ఉన్నాయి. www.jnu.ac.in/main/

సీఫెల్, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఉన్న 'సీఫెల్' పలు యూరోపియన్ భాషలకు సంబంధించిన కోర్సులను అందిస్తుంది. ఇందులో ఫ్రెంచ్, ఫ్రాన్సోఫోన్ స్టడీస్, జర్మనిక్ స్టడీస్, హిస్పానిక్ స్టడీస్, లాటిన్, రష్యన్‌కు స్టడీస్ తదితరాలపై పలు కోర్సులు ఉన్నాయి. https://www.efluniversity.ac.in

Scholarship Alert

Narotam Sekhsaria Scholarships for Higher Studies

Description: Narotam Sekhsaria Scholarships for Higher Studies 2025-26 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation that aims to provide financial assistance to outstanding Indian students aspiring to pursue higher education at prestigious institutions in India and abroad.
Eligibility: Applicants must be an Indian national residing in India and a graduate from an accredited Indian university. They should be under 30 years old as of 31st January 2025. They must plan to pursue a postgraduate degree in top-ranking institutions in India or abroad, starting in the Fall 2025.
Prizes & Rewards: The scholarship offers interest-free loans as financial assistance including mentorship support.
Last Date: 17-03-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/NSSP1

India High Fliers Undergraduate



Description: India High Fliers Undergraduate Scholarships 2025 is provided by the University of Birmingham to students pursuing selected full-time undergraduate programs at the university. A total of 20 scholarships will be available for the academic year 2025-26.
Eligibility: Applicants must be a domiciled resident of India holding an offer for a full-time undergraduate program. They must be classified as overseas fee-payer student.
Prizes & Rewards: The scholarship offers an amount of GBP 5,000 for the first year of undergraduate studies.
Last Date to Apply: 31-05-2025
Application mode: Offline applications via local representatives and partnered schools
Short Url: www.b4s.in/aj/IHFS1

Vahani Scholarship

Description: The Vahani Scholarship for 2025-26 is offered by the Vahani Group to Class 12 students. This scholarship aims to support students from economically disadvantaged backgrounds in India to pursue their higher education.
Eligibility: Open to Indian citizens currently studying in Class 12 and appearing for the final board examination next year. Applicants must have secured at least 85% marks in Class 10. The applicant's annual family income must be less than 300,000 from all sources.
Prizes & Rewards: Full tuition fees, stipend, and other benefits. ***Last Date:*** 01-12-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/VAHS1

buddy4study.com

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో
డిప్లొమా అడ్మిషన్లు

హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్'(సీఐటీడీ)లో 2025-26 సంవత్సరానికి కింది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. 1968లో ఏర్పాటైన కేంద్రప్రభుత్వ సంస్థ ఇది. ఇందులో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఎంఈ, ఎంటెక్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సులు	సీట్లు
• డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)	60
• డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)	60
• డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)	60
• డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)	60

(డీటీడీఎం కోర్సు నాలుగు సంవత్సరాలు - మిగిలిన కోర్సు మూడు సంవత్సరాలు)

విద్యార్హతలు: డీటీడీఎం కోర్సు చేయాలంటే కనీసం 50 శాతం మార్కులతో పది పాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.
వయోపరిమితి: 2025 మే 22 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
ఎంపిక: జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో చేయవచ్చు.
పరీక్ష విధానం: పదో తరగతి స్థాయిలో మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతోపాటు, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 22. **ప్రవేశ పరీక్ష:** 2025 మే 25
Contact Details: Admission Desk at Diploma Block
Ph: 9502405170, 040-29561795 **E-Mail:** training@citdindia.org,
Website: https://www.citdindia.org

ఐఐఐటీ శ్రీసిటీలో ఎంటెక్
వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్

గ్లోబల్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ 2026 నాటికి 64 బిలియన్ డాలర్లు చేరుకుని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని మెకిన్సే కంపెనీ అంచనా వేసింది. అందువల్ల వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుందని చెబుతోంది. అలాగే 2025 సంవత్సరం చివరి నాటికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) మార్కెట్ రెండు బిలియన్ డాలర్లు ఉండవచ్చని నాస్కామ్ చెబుతోంది. అటానమస్ వెహికిల్స్, డ్రోన్లు తదితరాల కారణంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, అటానమస్ టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్నాయి. ఇక సైబర్ సెక్యూరిటీ గురించి చెప్పాల్సిన పని లేదు.



2025 చివరి నాటికే ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో తమ కంపెనీ సైబర్ సెక్యూరిటీ బడ్జెట్‌ను అన్ని కంపెనీలు రెండింతలు చేయనున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని శ్రీసిటీలో ఉన్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'(ఐఐఐటీ) ఎడ్ కంపెనీ టీమ్ లీజ్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. వీఎల్ఎస్ఐ, ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీల్లో ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఎంటెక్ - వీఎల్ఎస్ఐ: సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్, అనలాగ్ సర్క్యూట్ డిజైన్, సిస్టమ్ ఆన్ చిప్ డెవలప్‌మెంట్‌పై కోర్సు ఉంటుంది. దీనితోపాటులో పవర్ వీఎల్ఎస్ఐ, నానో స్కేల్ డివైజెస్, మిక్స్‌డ్ సర్క్యూట్ డిజైన్‌లపై ఫోకస్ ఉంటుంది. సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ రోల్స్ కోసం పనిచేసేలా విద్యార్థులను తయారు చేస్తారు.

ఎంటెక్ - ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్: ఐవోటీ ఆర్కిటెక్చర్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అటానమస్ డెసిషన్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, 5జీ/6జీ టెక్నాలజీస్, డిజిటల్ ట్విన్ అప్లికేషన్స్ తదితరాల్లో ప్రావీణ్యం ఉండేలా రూపొందిస్తున్నారు.

ఎంటెక్-సైబర్ సెక్యూరిటీ: క్రిప్టోగ్రఫి, ఎథికల్ హాకింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, ఏఐ ఆధారిత థ్రెట్ డెసిషన్ తదితరాల్లో నాలెడ్జ్ ఉండేలా రూపొందించారు. బ్లాక్‌చైన్ అప్లికేషన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ లాంటి వాటిలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్ వచ్చేలా చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితరాల సైబర్ సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ పరిష్కరించేలా ఉంటారు. 2025 జూలై నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయి. సంవత్సరంలో ఒక వారం క్యాంపస్‌కి రావాల్సి ఉంటుంది. మిగిలిన క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ డిగ్రీని పూర్తిచేయాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 50 శాతం చాలు. అభ్యర్థులకు 'గేట్' స్కోరు తప్పనిసరి కాదు.

ఫీజు: సెమిస్టరుకు రూ. 65000/- చొప్పున నాలుగు సెమిస్టర్లకి కలిపి రూ. 2,60,000/- అవుతుంది.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్, ఫోన్‌లను సంప్రదించవచ్చు.
040-49170726, admission@iiitsricityonline.com
https://cep.digivarsity.com/iiit-sricity/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

షూటింగ్ పూర్తి



కంగనా రనౌత్, మాధవన్ జంటగా మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రధారులుగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిత్రబృందంతో సెట్‌లో దిగిన ఫొటోలను షేర్ చేశారు. త్వరలోనే టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రం తర్వాత కంగన, మాధవన్ కలసి నటించిన చిత్రమిది. అలాగే 'తలైవి' చిత్రం తర్వాత మరోసారి ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగన నటించారు. తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కొత్త ప్రయాణం మొదలు



నటి అభినయ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించాననీ, త్వరలో అతన్ని పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె తెలిపారు. ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినయ తెలిపారు. కాబోయే భర్తతో కలసి ఆలయంలో గంట కొడుతున్న ఫొటోను షేర్ చేసి, 'కొత్త ప్రయాణం మొదలైంది' అని చెప్పారు. అయితే కాబోయే భర్త వివరాలు, పెళ్లి ఎప్పుడు జరగబోతోంది అనే విషయాలను ఆమె తెలపలేదు. పలు దక్షిణాది సినిమాల్లో నటించిన అభినయ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివ శంభో' తదితర చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్నారు.

భయానక అనుభవాల కథ



యదార్థ సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ - ఆర్వి ప్రొడక్షన్స్ బేనర్‌పై గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో రవిశంకర్ వర్మ నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్యదేవి జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పలు భారతీయ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఎదుర్కొన్న భయానక అనుభవాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఓ మంచి సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని రవిశంకర్ చెప్పారు.



శ్రీలీలకు చిరంజీవి కానుక

నటి శ్రీలీలకు చిరంజీవి ఓ విలువైన కానుకను బహూకరించారు. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా సెట్స్‌లో శ్రీలీల సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుర్గాదేవి ప్రతిమ ఉన్న ఓ వెండి శంఖాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు చిరంజీవి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు శ్రీలీల. భారీ బడ్జెట్‌తో వంశీ, విక్రమ్, ప్రమోద్ 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కూడా ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు.

చరిత్రలో నిలిచిపోయే చిత్రం...



'మల్లేశం', '8 ఏఎమ్ మెట్రో' చిత్రాల దర్శకుడు రాజ్ రాచకొండ. ఆయన దర్శకత్వంలో కొత్త చిత్రం రాబోతోంది. నటుడు రానా దగ్గుబాటి సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా, స్టూడియో 9తో కలసి నిర్మిస్తోంది. తేజ, తన్మయి, ఝాన్సీ, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1990ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు '23' అనే టైటిల్‌ను ఖరారు చేసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ "ఈ సినిమా మానవ హక్కుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి గురైన వారికి అండగా ఉంటుంది. తప్పు చేయడం తప్పని చెప్పడంతో పాటు హింసకు వ్యతిరేకంగా ఉంటుంది" అని అన్నారు. "ఈ సినిమాను ప్రేక్షకులు వెతుక్కుంటూ వచ్చి చూస్తారు. చరిత్రలో నిలబడిపోతుంది" అని నటి ఝాన్సీ చెప్పారు.

స్పెషల్ సాంగ్‌తో సిద్ధమా?

సినిమాల్లో కథానాయిక పాత్రల్లో అలరించడమే కాదు, అప్పుడప్పుడూ రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తుంటారు తారామణులు. జనాల్లో క్రేజ్ పెంచడమే కాకుండా సినిమా విజయానికీ దోహదపడుతుంటారు. తాజాగా అగ్రహీరోలతో ప్రత్యేక గీతాలు చేస్తున్నారంటూ కొంతమంది హీరోయిన్ల పేర్లు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. వారెవరో తెలుసుకుందాం.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజాసాబ్'. ఈ హారర్ థ్రిల్లర్‌లో మాంచి జోష్‌తో నిండిన ప్రత్యేక గీతం ఉందట. ఈ పాటలో స్టెప్పులేసేందుకు ఓ స్టార్ హీరోయిన్ అయితే బావుంటుందని భావించిన చిత్రబృందం నయనతారని సంప్రదించారని టాక్. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో ప్రభాస్‌కు జంటగా 'యోగి' సినిమాలో హీరోయిన్‌గా నటించారు నయనతార. ఇక 'యానిమల్' సినిమాలో అందాల ఆరబోతతో అలరించిన త్రిప్తి దిమ్రీని సైతం మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీరిలో ఎవరు ఫైనల్‌గా పాటలో కనపడతారనేది తెలియాల్సి ఉంది.

ఎన్టీఆర్.. హృతిక్‌తో

2022లో వరుణ్‌ధావన్ హీరోగా నటించిన 'భేడియా' చిత్రంలో 'తుమ్‌కేశ్వరీ' అనే ప్రత్యేక గీతంలో మెరిశారు శ్రద్ధా. 'పుష్ప 2'లో 'కిస్సిక్' సాంగ్ కోసం మొదట శ్రద్ధాని సంప్రదించినా పారితోషికం తక్కువని ఆమె అంగీకరించలేదు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'లో ఆమె స్పెషల్ సాంగ్ చేయబోతున్నారట. 2019లో విడుదలై సూపర్ హిట్ సాధించిన 'వార్'కు ఇది కొనసాగింపు. ఈ సినిమాపై తారస్థాయిలో ఉన్న అంచనాలను మరింత పెంచేలా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందుకోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నారు. 'స్త్రీ 2'తో ఇండస్ట్రీ హిట్ కొట్టిన శ్రద్ధా కపూర్‌ను ఈ పాట కోసం సంప్రదించారని టాక్. మంచి డ్యాన్సరైన శ్రద్ధా తన స్టెప్పులతో.. ఎన్టీఆర్, హృతిక్ ఎనర్జీని పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేస్తారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారట.

ఒకేసారి రెండు చిత్రాల్లో..

'గేమ్ ఛేంజర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కియారా అద్వానీ. యశ్ కథానాయకుడిగా 'ముథూన్' ఫేమ్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'సలార్' చిత్రానికి సీక్వెల్‌లో కీలక పాత్రతో పాటు ప్రత్యేక గీతంలో కియారా తళుక్కున మెరవనున్నారనే టాక్ నడుస్తోంది. 2022లో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'గోవింద్ మేరా నామ్' చిత్రంలో 'బిజిలీ' అనే ప్రత్యేక గీతంలో నటించారు కియార.

సీక్వెల్‌లోనూ ఛాన్స్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్' సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో తమన్నా భాటియా చేసిన 'నువ్వే కావాలయ్యా' ప్రత్యేక గీతం పెద్ద హిట్ అయింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌లో తమన్న పాత్ర నిడివిని పెంచడంతో పాటు ఆమెతో ప్రత్యేక గీతం ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవలే తమన్న 'స్త్రీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేయడం.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. ఆ సెంటిమెంట్ కలిసొస్తుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారట మేకర్స్.

ఓజీ కోసం రాధిక

'డీజే టిల్లు' చిత్రంతో యువతరాన్ని ఆకట్టుకున్న కథానాయిక నేహా శెట్టి. ఆ చిత్రంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ భామకు ఓ సూపర్ ఆఫర్ వచ్చింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ప్రత్యేక గీతం కోసం నేహా శెట్టిని ఎంపిక చేశారు. అయితే, ఇందులో ఆమె కేవలం ఓ పాటకే పరిమితమవుతారా లేదా కీలక పాత్రలో నటిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

మరోసారి ప్రత్యేక గీతంలో

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'రెట్రో'. మే 1న విడుదలవనున్న ఈ సినిమాలో శ్రియ ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేశారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పవన్‌కల్యాణ్ నటించిన 'పులి'.. వెంకటేశ్ నటించిన 'తులసి'.. తరుణ్ నటించిన 'సోగ్గాడు'.. ప్రభాస్ నటించిన 'మున్నా' వంటి పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్నారు శ్రియ.

పశ్చిమ డెల్టాకాల్వకు 1616 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1616 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.1 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 130, తూర్పుకాల్వకు 251, పశ్చిమకాల్వకు 160, నిజాంపట్నంకాల్వకు 110, కొమ్మమూరుకాల్వకు 666 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

మొక్కల పంపిణీ

మంగళగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం - పర్యావరణ పరిరక్షణ బృందం ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి మిద్దె సెంటరులో ప్రజలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రతలను గురించి ప్రజలకు వివరించారు. డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను పోషించాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జీ అప్పలనాయుడు, ఆర్ కోటేశ్వరరావు, సయ్యద్ మహబూబ్ సుభానీ, తప్పెట్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సరిపూడిలో ఒకరికి కత్తిపోట్లు

మేడికొండూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో మేడికొండూరు మండలంలోని సరిపూడి గ్రామంలో ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన కొందరు తెలుగుదేశం పార్టీకి చెందిన మర్రి నరేష్ అనే వ్యక్తిని కత్తితో పొడిచారు. సరిపూడి గ్రామానికి చెందిన నరేష్ తెలుగుదేశం పార్టీ అభిమాని. ఇదే సామాజిక వర్గానికి విశ్వేశ్వరరావు, మర్రి సతీష్ అనే వ్యక్తులు వైసీపీ కార్యకర్తలు. రెండేళ్ల క్రితం వైసీపీ అధికారంలో ఉండగా స్వల్ప విషయమై నరేష్‌ను, మరికొందరిని వైసీపీ వారు దాడి చేసి కొట్టారు. కొట్టిన వాళ్లే అప్పట్లో నరేష్‌పైన మరో ఇద్దరిపైన మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత తమపై పెట్టిన అక్రమ కేసు తొలగించాలని టీడీపీకి చెందిన నరేష్ మరో ఇద్దరు మేడికొండూరు పోలీసులను ఆశ్రయించారు. అప్పటికే కేసు నమోదై ఉండడంతో గ్రామపెద్దల ద్వారా రాజీ చేసుకోవాలని పోలీసులు సూచించారు. కొద్ది రోజుల క్రితం కొందరు గ్రామస్థుల ద్వారా కేసు రాజీ చేసుకోవాలని ప్రయత్నించారు. ఈ విషయమై ఆదివారం విశ్వేశ్వరరావు, సతీష్‌లు కలిసి నరేష్‌తో గొడవకు దిగారు. ఒకరినొకరు తిట్టుకుంటుండగా గ్రామస్థులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. కొద్ది సేపటి తరువాత నరేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా విశ్వేశ్వరరావు, సతీష్‌లు మరో ఇద్దరితో కలసి దాడి చేసి కత్తితో పొడిచారు. దీంతో నరేష్‌కు చేతిపైన గాయమైంది. ఇతనిని ఆస్పత్రికి తరలించారు. నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్జీ దారులు తమ ఫిర్యాదులను సమీపంలోని ఆయా కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలని సూచించారు.

డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అవకాశం

గుంటూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్ష రాసే బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖాధికారి మయూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పాసైన అభ్యర్థులకు మాత్రమే ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు పది, టీటీసీ లేదా బీఎడ్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించరాదు) ఆధార్, రెండు ఫొటోలతో గుంటూరు రాజాగారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో (0863-2358071) సంప్రదించాలన్నారు. ఈనెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందాడు. దాసరిపాలేనికి చెందిన నరేంద్ర, మంజుల దంపతులు చిన్న కుమారుడు షణ్ముఖ కుమార్‌ను తీసుకొని ద్విచక్ర వాహనంపై గుంటూరులో సరుకులు కొనుగోలు చేసేందుకు బయలుదేరారు. వారు జాతీయ రహదారిపై టయోటా షోరూం సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారి ద్విచక్ర వాహనం డివైడర్‌కు ఢీకొనడంతో షణ్ముఖ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నరేంద్రకు గాయాలయ్యాయి. తల్లి మంజుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతానం కలుగలేదని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సంతానం కలగడం లేదనే కారణంగా ఏటుకూరుకు చెందిన ఏపూరి బాజీ బాబు (31) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాజీ బాబు ఓ ప్రముఖ పచ్చళ్ళ కంపెనీలో పని చేస్తుంటాడు. 11 ఏళ్ల క్రితం బాజీ బాబుకు శిరీషతో వివాహమైంది. అయితే సంతానం కలగడం లేదని మనస్థాపానికి గురై ఈ నెల 7న లాల్‌పురం శివారు ఖాళీ ప్లాట్లలో పురుగుల మందు తాగాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● ఖాళీగా ఉన్న ఆర్అండ్‌బీ, ఎంపీడీవో కార్యాలయాలు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయం



ఉపయోగంలో లేని ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయం

తాడికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని ఉపయోగించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అట్టహాసంగా భవనాల ప్రారంభోత్సవాలు జరిగినా, పాత భవనాల్లోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకిరుకుగా ఉన్న భవనాల్లోని ఉద్యోగులు కూర్చొని తమ పనులు చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ నూతన భవనాన్ని నిర్మించటానికి 2016లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే నిధుల్లేని కారణంతో నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మారిన తరువాత నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తి చేశారు. పూర్తి చేసిన భవనాన్ని 2023 జూన్ 29 తేదీన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కత్తెర సురేష్‌కుమార్‌లు అట్టహాసంగా ప్రారంభించారు. భవనాన్ని ప్రారంభించి సంవత్సరాలు గడిచినా ఇంతవరకు నూతన భవనంలోకి ఉద్యోగులు వెళ్లలేదు. పాత భవనంలోనే ఉండి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే కార్యాలయంలోని పాత భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో దాన్ని కూల్చి వేశారు. ఆ భవనంలో ఎంపీపీ ఛాంబర్, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీసీ కార్యాలయాలు ఉండేవి. 2024 ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారి మండల పరిషత్ నూతన భవనాన్ని ఎన్నిక ల విధుల కోసం వినియోగించుకున్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత తిరిగి భవనానికి తాళాలు పడ్డాయి. అప్పుడప్పుడు సమావేశాలు నిర్వహించుకోవటానికి మాత్రమే భవనాన్ని ఉపయోగిస్తున్నారు. రహదారులు, భవనాల శాఖ ఉపకార్య నిర్వాహక ఇంజనీరు భవనానికి తాళాలు పడ్డాయి. భవనం తాళాలు తీసి ఏళ్లు గడుస్తున్న అధికారులు మాత్రం కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదు. పేరుకే కార్యాలయం కానీ సిబ్బంది ఒక్కరోజు కూడా స్థానికంగా అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు. ఐదేళ్ల క్రితం భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో పత్రికల్లో కథనాలు రావటంతో రూ.లక్షల్లో వ్యయం చేసి రిపేర్లు చేయించారు. రిపేర్లు చేయించారుగాని ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండటం లేదు. భవనాన్ని ఒక్క రోజు కూడా ఉద్యోగులు ఉపయోగించలేదు. కొంత కాలం వరకు నాలుగో తరగతి ఉద్యోగి ఉన్నారు. మండలంలో ఆర్అండ్ బీ రోడ్లు వేసినప్పుడు మాత్రమే సేదతీరటానికి అప్పుడప్పుడు సిబ్బంది వచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అయితే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆర్అండ్‌బీ భవనం ఉండటంతో రెవెన్యూ సిబ్బంది అవసరాలకు వినియోగించుకుంటామని భవనం తాళాలు అడిగినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన భవనం వర్షాలకు కారుతుంది. రెవెన్యూ రికార్డులు భద్రపరు చుకోవటానికి ఈ భవనం ఉపయోగుతుందని రెవె న్యూ అధికారులు పేర్కొన్నారు. వీఆర్‌వోలు పనులు చేసుకోవటానికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నేతలు ఆదివారం పంపిణీ చేశారు. కొత్తపేటకు చెందిన మోర్ల లక్ష్మీకి రూ.2,57,143లు, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన సయ్యద్ రోషన్ జమీర్‌కు రూ.50,378లు, 28వ వార్డుకు చెందిన శిఖా కోటేశ్వరరావుకు రూ.94,980ల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో భరోసానిస్తుందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి నియోజకవర్గానికి అధిక మొత్తంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సైనాథం శ్రీనివాసరావు, తురకా వీరశేఖర్‌బాబు, దిడ్లా సత్యానందం, వాకా మాధవరావు, కోపూరి రాంబాబు, కురగంటి చంటి, దేవరాజు, చుక్కా ఏసోబు, కొరముట్ల రమేష్‌బాబు, రాజా, సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

తాడేపల్లి (కుంచనపల్లి), (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఆదివారం లబ్ధిదారులకు టీడీపీ నేతలు అందజేశారు. గ్రామానికి చెందిన గంధం ఉమామహేశ్వరికి రూ.65వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, దాసెట్టి అరుణ, జనసేన నాయకులు పసుపులేటి అశోక్, కొప్పూరి సురేష్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మహిళా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఎస్ సవితను సన్మానిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, తిరువీధుల కిరణ్, స్వాతి గౌడ్ తదితరులు. -మంగళగిరి

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



మహిళలను సన్మానించిన వివిధ రంగాల ప్రముఖులు

మంగళగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిస్తే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని దూరదర్శన్ ప్రాంతీయ వార్తా విభాగాధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు అభిప్రాయపడ్డారు. మంగళగిరి పట్టణంలోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనెస్కో క్లబ్ ప్రతినిధి రామనాథం పరమేశ్వరరావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు అధ్యక్షత వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న 15 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవ వికాస మండలి అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు, ఆశ్రమం అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు, విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ ధ్యాన నిర్వాహకులు వల్లభనేని వాణి, గాయని కొౌతరపు కవిత, శారదా వాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు

దుగ్గిరాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను మూడో రోజు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాకేత్‌శర్మ, రామచంద్రుల పర్యవేక్షణలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం శ్రీసుదర్శన హోమం నిర్వహించారు. కోనేరు మల్లికార్జునప్రసాద్, కొంగర సుధీర్‌కుమార్, కంభంపాటి క్రాంతి కుమార్, పరుచూరి శ్రీనివాసరావు, పైనేని రమేష్ దంపతులచే హోమం జరిపించారు. ఉదయం 6గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, నవనీతహారతి, పారమాత్మిక హోమం, ఆలయ బలిహరణ, నవ కుంభారాధన, సుదర్శన హోమానంతరం దంపతులతో పూజా కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం నిత్యహోమం హనుమంత హోమం, తదితర కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.60 వేల విలువగల పంచలోహ భోగశ్రీని వాసుని ఉత్సవమూర్తిని హైదరాబాద్ వాస్తవ్యులు పరుచూరి శ్రీనివాసరావు, లక్ష్మీరమణ దంపతులు అందించినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఆలయప్రాంగణం ఆద్యంతం భక్తులు గోవిందనామస్మరణతో నిండిపోయింది. బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, బ్రహ్మోత్సవాలను తిలకిం చేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను గావించారు.

కేవీఆర్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

తుళ్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యనేర్పిన ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు.. రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.. 35 సంవత్సరాల తరువాత అందరూ కలుసుకోవటంతో ఆనందించారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1989-90 సంవత్సరం మధ్య పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు తెలుగుభాష ప్రాధాన్యాన్ని మరో సారి బోధించారు. హిందీలో 23 సంవ త్సరాలు పాటు ఇదే పాఠశాలలో విద్యాబోధన చేసిన ఇందుమతి విశ్రాంత ఉపాధ్యాయిని ప్రసంగిస్తూ తుళ్లూరుతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి ఆమె మురిసిపోయారు. అమరావతి ఉద్యమానికి ప్రాతినిధ్యం వహించిన ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థి పువ్వాడ సుధాకరరావును అందరూ సన్మానించారు. పాఠశాల ప్రారంభమై 75 వసంతాలు నిండుతున్న తరుణంలో 75 వసంతాల పండుగ నిర్వహణకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడతామని ప్రధానోపాధ్యాయుడు గుత్తా శ్రీనివాసరావుకు పూర్వ విద్యార్థులు హామినిచ్చారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో వ్యవసాయ రంగం

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగం కార్పొరేట్ కంబంధ హస్తాల్లో చిక్కుకుపోయిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. మంగళగిరి వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2021 ఢిల్లీలో రైతు ఉద్యమ విరమణ సందర్భంగా రాతపూర్వ కంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్ర సంక్షోభంలో పడిపోయారని, మిర్చి పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. గుంటూరు జిల్లాలోనే గత వారంలో నలుగురు రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేసి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ ఆధ్వర్యంలో సోమవారం అన్ని వ్యవసాయ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహి స్తామని తెలిపారు. తొలుత ధర్నాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వియోగించుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు




విద్యార్థులకు పుస్తక పఠనం గురించి వివరిస్తున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు

పెదనందిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదువు అంటే మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ పుస్తకాలు, మాస పత్రికలు చదవడం వల్ల మేధాశక్తి పెంపొందించుకోవడంతో పాటు పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, శివయ్య, రవి, మల్లిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

● ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్



గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విద్యార్థులు

కాకుమాను, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తయిన తరువాత కూడా వారి జీవితంలో సామాజిక సేవలను భాగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్ విద్యార్థులకు సూచించారు. బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ అగ్రికల్చరల్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మండలంలోని అప్పాపురం, రేటూరు గ్రామాల్లో ఆదివారం జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చెత్త కుండీల నుంచి చెత్త వేరు చేయు విధానం, మొక్కలు సస్యరక్షణ తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, వెంకటేశ్వర్లు, అశోక్, రాకేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి తీరని లోటు

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) మృతి తీరని లోటని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. బాలకృష్ణ ప్రసాద్ గుండెపోటుతో ఆదివారం సాయంత్రం స్వగృహంలో కన్ను మూశారని అన్నారు. ఆయన వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన చేశారన్నారు.

ఆలపాటికి జనసేననేత కోటేష్‌బాబు అభినందనలు



ఎమ్మెల్సీ ఆలపాటిని కలిసి బొకే అందజేస్తున్న జనసేన రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ లీలాకోటేష్‌బాబు తదితరులు

తాడేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అత్యధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం జనసేన ఐటీ వింగ్ గుంటూరు జిల్లా తరపున రాష్ట్ర కో ఆర్డినేటర్ చవ్వాకుల లీలాకోటేష్‌బాబు నేతృత్వంలో పలువురు ఆలపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 1000 ఓట్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించడమే కాక 5000 మంది గ్రాడ్యుయేట్ మిత్రులను కలిసి ఆలపాటికి మద్దతు ఇవ్వవలసిందిగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించామని కోటేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో రవికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని కలిసిన ఆళ్ల వెంకట్



ఆలపాటికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్నారై ఆళ్ల వెంకట్

పెదనందిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజాను గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఎన్నారై లాస్‌ఏంజెల్స్ టీడీపీ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9నెలల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చేసి చూపిస్తున్నారనే దానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు వచ్చిన అత్యధిక మెజార్టీనే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, ఐటీడీపీ నియోజకవర్గ కార్యదర్శి దివ్వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలను తరిమికొట్టాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నేతలు

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఎన్డీఏ కూటమి తిరిగి అధికారంలోకి వచ్చాక మతం పేరుతో ప్రజలను విడదీసి విద్వేషాలను రెచ్చగొడుతుందని ధ్వజమెత్తారు. ఈ విధానాల వల్ల లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 77 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో నేటికీ దేశంలో 40 శాతం మంది దారిద్ర్యంలోనే వున్నారంటే అందుకు పాలకుల విధానాలే కారణమని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు గ్రాంట్‌గా ఇవ్వాలని, అందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు జాలాది జాన్‌బాబు, ముసునూరి సుహాస్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవన్నారాయణకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దేవతి భగవన్నారాయణ

మంగళగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఊటీలో ట్రైబల్ కల్చర్ సెంటరులో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి డాక్టరేట్లను ప్రదానం చేశారు. మంగళగిరికి చెందిన డీబీఎన్ గ్రూపు సంస్థల ఛైర్మన్ దేవతి భగవన్నారాయణ సేవలను యూనివర్సిటీ గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. గౌరవ డాక్టర్ ఆఫ్ హ్యూమానిటీ విభాగంలో భగవన్నారాయణకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మద్రాస్ మాజీ హైకోర్టు జడ్జి డాక్టర్ వెంకటేష్, తమిళనాడు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ సంపత్‌కుమార్, వైస్‌చాన్సలర్ డాక్టర్ మ్యానువల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి విజయమోహన్ తదితరుల సమక్షంలో ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. భగవన్నారాయణకు డాక్టరేట్ లభించడంపై డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, మంగళగిరి రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉండవల్లిలో రాజధాని రైతుల సమావేశం

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 10న జరుగు రాష్ట్ర రైతు సంఘం ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రాత్రి ఉండవల్లి సెంటర్లో ప్రజా సంఘాల కార్యాలయంలో రాజధాని రైతు సంఘం కమిటీ సమావేశం తక్కెళ్లపాటి బక్కిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రైతులను భూముల నుంచి వెళ్లగొట్టడానికి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను భూముల నుంచి దూరం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన వారు ఈరోజు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. దానిని నివారించాలని కోరారు. ఈ నెల 10వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు సమస్యల పరిష్కారానికి గుంటూరు చుట్టుగుంట రాష్ట్ర వ్యవసాయ కార్యాలయం వద్ద జరిగే రాష్ట్ర స్థాయి ధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతుసంఘం నాయకులు గణేష్, కోటేశ్వరరావు, దండమూడి సాంబశివరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పార్లమెంట్ సీట్లు సాధించేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి డి లిమిటేషన్‌లో ఎక్కువ పార్లమెంట్ సీట్లు సాధించేందుకు కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు కోరారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమిలో ఉన్నందున కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఈ విషయంపై మాట్లాడాలన్నారు. వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శీను, బుల్లియ్య, పూర్ణచంద్రరావు, శివకుమార్, రాయప్ప, కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.

కొలకలూరులో ఉచిత కంటివైద్యశిబిరం

తెనాలి రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు జడ్పీహెచ్ స్కూల్‌లో ఆదివారం చినకాకాని ఎన్ఆర్ఐ వైద్యశాల సౌజన్యంతో గ్రామస్థులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు పాల్గొని గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కూటమి నాయకులు నాగేశ్వరరావు, ఆరుంబాక నాగేశ్వరరావు, కొలకలూరు కిషోర్ తదితరులు పర్యవేక్షించారు. వైద్యసిబ్బంది, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వెలగని లైట్లు

చెంచుపేట ఓవర్ బ్రిడ్జిపై వెలగని లైట్లు

తెనాలి మారీసుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట పాత బస్టాండ్ వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై ఏర్పాటుచేసిన కొన్ని లైట్లు కొంతకాలంగా మరమ్మతులకు గురై వెలగడం లేదు. ప్రతిరోజు కొన్ని వందల మంది ఓవర్ బ్రిడ్జి మీదగా చెంచుపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిపూట లైట్లువెలగక చీకటిలో ఫుట్‌పాత్‌లపై వెళ్లే పాదచారులు వాటిపై ఉన్న గుంతలు కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేసి బ్రిడ్జిపై లైట్లు వెలిగేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

భుక్తి కోసం రౌడీలమంటూ బెదిరింపులు

● డీఎస్పీ జనార్దనరావు

తెనాలి క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కొందరు రౌడీలమని అమాయకులను బెదిరిస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు తప్ప తెనాలి ప్రాంతంలో రౌడీయిజం పూర్తిగా నిర్మూలించాం. గతంలో రౌడీలమని బతికినవారు ఇప్పుడు ఇతర రాష్ట్రాలలో తలదాచుకున్నారని డీఎస్పీ జనార్దనరావు వెల్లడించారు. ఆదివారం వన్‌టౌన్ పరిధిలోని పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో తెనాలి, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 340 మంది రౌడీషీటర్స్‌ని గుర్తించామన్నారు. అనుమానితులు మరో 190మంది ఉన్నారని, గత కొద్దినెలలుగా చేపట్టిన కఠినచర్యల వలన వీరిలో చాలామంది గొడవలకు దూరంగా కుటుంబాలని పోషించుకుంటూ జనజీవనంలోకి వచ్చారన్నారు. కొద్దిమంది రాష్ట్రం వీడి హైదరాబాద్ లాంటి ప్రాంతం వెళ్లి కూలీనాలీ చేసుకుంటున్నారని చెప్పారు. సత్ ప్రవర్తన కలిగిన 190మంది రౌడీషీటర్లు, 160మంది అనుమానితులను రౌడీషీట్ నుండి తీసివేయడం జరిగిందన్నారు. తెనాలి వన్‌టౌన్‌లో 33 మంది పాతనేరస్తులు ఉన్నారని, వీరి ఇళ్లను ప్రతిరోజూ మహిళా కానిస్టేబుల్‌గాని పోలీసులు గాని వెళ్లి వారి దినచర్య గమనిస్తుంటారని చెప్పారు. ఎలాంటి తేడా కనిపించినా స్టేషన్‌కి కౌన్సెలింగ్‌కి పిలుస్తామన్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలలో ఏర్పడే చిన్నచిన్న గొడవలు తప్ప తెనాలి ప్రాంతంలో నేర సంఘటనలు పూర్తిగా అదుపులోకి తెచ్చామని డీఎస్పీ వివరించారు.



పాత నేరస్తులను విచారిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

15న తిరుమలకు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి పాదయాత్ర



గోశాలకు పాదయాత్రగా వెళ్తున్న బాలస్వామి, భక్తులు

తెనాలి, మారీసుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం ఈనెల 15వ తేదీ నుండి తెనాలి నుండి తిరుమలకు పాదయాత్ర చేయనునట్లు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలో శ్రీసాలిగ్రామ మఠంలో లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారు అమ్మవార్లకు శ్రీప్రజ్ఞానంద సరస్వతి ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులతో కలసి బుర్రిపాలెం రోడ్డులోని గోశాల వరకు పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ లోక కల్యాణార్థం తిరుమలలోని కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించేందుకు భక్తులతో కలసి పాదయాత్రను చేస్తునామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రావూరి సుబ్బారావు, ట్రెజరర్ గోపు రామకృష్ణ, ముద్దాభక్తుని రమణయ్య, చుండూరు లోకనాథం, సుధాకర్, జయలక్ష్మి మాతృమండలి, శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రామనామ పారాయణ ఉత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత పట్టణంలో 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలలో భాగంగా తొలి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విఖనస శ్రీనివాస ట్రస్ట్, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శోభాయాత్రలో డీఎస్పీ జనార్ధనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు. సోమవారం శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సామూహిక సరస్వతీ పూజ, అనంతరం ప్రముఖ అవధాన సరస్వతి మాడుల నాగ ఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారు. మంగళవారం శ్రీరుక్మిణి కళ్యాణం, ఆధ్యాత్మిక వేత్త మాచిరాజు వేణుగోపాల్, జ్యోతిష్య సుధ మాచిరాజు కిరణ్‌కుమార్, ప్రవచన నిధి పద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, సామూహిక సింధూరార్చన, బుధవారం శ్రీసీతారాముల కళ్యాణం, ఆగమ వాచస్పతి వేదాంతం రాజగోపాలచక్రవర్తి, ఆకెళ్ల విభీషణశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, సాయివేద వాగ్దేవి భక్తి గీతాలాపన జరుగుతాయి. గురువారం సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం, శిల్ప, సీతారామాచార్యులు, గరికపాటి నరసింహారావుల ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తారు. శుక్రవారం విశేష హోమం, విద్యారణ్య భారతీ స్వామి చేతుల మీదుగా పూర్ణాహుతి, సామూహిక కుంకుమార్చన, పుష్పోత్సవం, గరికపాటి నరసింహారావు ప్రవచనం జరుగుతాయి. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



రామనామ పారాయణ పత్రికల శోభాయాత్ర

వైభవంగా జీవ ధ్వజ ప్రతిష్ఠ



స్వామి వారి విగ్రహాలను తీసుకువస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గాంధీచౌక్‌లోని రుక్మిణీ సత్యభామా సమేత గోవర్ధనస్వామి, వీరప్రతాపస్వామి ఆలయంలో ఆదివారం జీవధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముందుగా గాయత్రి హోమం, యుక్త హోమం జరిపారు. అనంతరం ధ్వజ ప్రతిష్ఠ, విమాన గోపురాలకు కుంభాభిషేకం చేశారు. ఊంజల్ సేవ, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. మాల్యావంతం శ్రీనివాస దీక్షితులు నిర్వహించిన ప్రతిష్ఠ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ కేపీ శ్రీనివాస్, ఈవో మల్లేశ్వరి, ధర్మకర్తలు శివ, భాస్కరరావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యంకు ఘన సన్మానం



డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న సొసైటీ ప్రతినిధులు

తెనాలి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు గుత్తి సుబ్రహ్మణ్యం దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తింశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం దంపతులకు వైద్యసేవా రత్న బిరుదుతో సత్కరించారు. వైద్య శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు కోటేశ్వరప్రసాద్, నవీన్, సుధారాణి, నాగరాజు, చైతన్య, శృతి, హిమజ, శ్రీనిధి, పవన్‌కుమార్‌లు వైద్యసేవలు అందించారు. డాక్టర్ హనుమంతరావు, మస్తానమ్మ, శారదా, విజయలక్ష్మి, అనీల్‌కుమార్, అవినాష్, పురుషోత్తం, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పంచుమర్తి భాస్కరరావు, జొన్నాదుల నరసింహారావు, వెంకటప్రసాద్, రాచబత్తుని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

● ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ వెంకటాద్రి

ఫటా ఫట్



తెనాలి క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మిగిలిన కాలంలో కంటే వేసవిలో అగ్ని ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది... వీటిని నిరోధించడంలో అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ఒక్కొక్కసారి భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది... తెనాలి అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కొండవీటి వెంకటాద్రి అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: వేసవిలో ఎలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి?

జవాబు: గడ్డివాములు, గుడిసెలు ఉన్న చోట సిగరెట్, బీడీ లాంటివి కాల్చి అది ఆర్పి వేయకుండా పడవేస్తారు. అది గాలులకు రవ్వలు రేగి వాములు, గుడిసెలు తగలబడే అవకాశం ఉంటుంది. అదేవిధంగా వేసవిలో పొలాలలో ఎండిన జొన్న, మొక్కజొన్న వ్యర్థాలు రైతులు పొలంలో కాలుస్తుంటారు. వాటి అగ్గిరవ్వలు సమీపంలోని పూరిళ్లు, వాములపై పడి అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి.

ప్రశ్న: షార్ట్ సర్క్యూట్‌తోనూ ప్రమాదాలు జరుగుతాయి. వాటి నివారణ ఎలా?

జవాబు: వేసవిలో ఈదురు గాలులకు పొలాలపై ఉన్న విద్యుత్ వైర్లు, ఇళ్ల మధ్య ఉండే సర్వీసు వైర్లు, ఇళ్లలో విద్యుత్ జాయింట్స్ ఊడి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతాయి. ఇలాంటి వాటి విషయంలో సకాలంలో గుర్తించి వాటి మరమ్మతులు చేయించాలి.

ప్రశ్న: వంటగదిలో జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు అవసరం?

జవాబు: నాసిరకం గ్యాస్‌ట్యూబ్‌ల వినియోగంతో లీకులు ఏర్పడి అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే గ్రామాలలో ఇంటి ముందల కట్టెల పొయ్యి వెలిగించి ఇతర పనులు చూసుకుంటారు. వీటి నుండి వచ్చే రవ్వల వలన కూడా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి.

దాడిపై కేసు నమోదు

తెనాలి క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్టా రాఘవయ్య రైస్‌మిల్లు రోడ్డులో ఆదివారం తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళుతున్న బృందంపై ఇద్దరు యువకులు దాడి చేశారు. దానిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తీన్‌మాన్ బృందం మేస్త్రీ నరసింహ ఊరేగింపుగా ముందు వెళుతుండగా ఆ ప్రాంతంలో ఉన్న ఇద్దరు యువకులు ప్రసాద్, వంశీలు వాయిద్యం ఆపాలని గొడవపడి అతని తలపై రాయితో గాయపరిచారు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోశాల గడ్డివామి దగ్ధం

పొన్నూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న గోశాల గడ్డివామిని దగ్ధం చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గోశాల నిర్వాహకుల కథనం ప్రకారం వెంకటేశ్వర యాదవ్ అనే వ్యక్తి ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ గోశాల నిర్వహిస్తున్నారు. గోశాలలోని ఆవుల మేతకు తెచ్చిన మూడెకరాల గడ్డివామికి ఆదివారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు లేదా ఆకతాయిలు గడ్డివామికి నిప్పంటించి ఉంటారని గోశాల నిర్వాహకులు అనుమానిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో గడ్డి పూర్తిగా కాలిబూడిదైంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు హుటాహుటిన తరలివచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ప్రమాదంపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో అర్బన్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

ఘనంగా శ్రీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలు



హనుమంత వాహనంపై శ్రీజనార్దనస్వామి ఊరేగింపు

కొల్లిపర, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆదివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పండితులు పూజలు నిర్వహిస్తున్నారు. పండితులు బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశర్మ, జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృథ్వీబార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మ స్వామి వారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి విష్వక్సేన, పుణ్యాహవచన వంటి పూజలు చేసిన అనంతరం హనుమంత వాహనంపై స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు మంత్ర పుష్పంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ఆరెమండ్లమ్మ తల్లి తిరునాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరెమండ గ్రామంలో ఉన్న శ్రీ ఆదిపరాశక్తి ఆరెమండ్లమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామున జలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి తిరునాళ్లలో పాల్గొనేందుకు ఆరెమండ, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆరెమండ్లమ్మ తల్లి



లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

సీఎం సహాయనిధితో రోగులకు అండ

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని పలు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన నగదు చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. మండల పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన షేక్ జానా వలికి రూ.46,084, పఠాన్ షాహీదాకు రూ.40 వేలు, చేబ్రోలు గ్రామానికి చెందిన మల్లవరపు శౌరీలుకు రూ.37,205, కారుమూరి మరియమ్మకు రూ.22,074, వడ్లమూడి గ్రామానికి చెందిన షేక్ మెహరీన్‌కు రూ.89,775, మంచాల గ్రామానికి చెందిన నిమ్మ శిరీషాకు రూ.50 వేల నగదు చెక్కులను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా ద్వారా అనేక వ్యాధులకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందజేస్తుందన్నారు. అయితే ఈ పథకం కింద అమలులో లేని శస్త్ర చికిత్సలు, వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

తెనాలి, మారీసుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుర్రిపాలెంలోని శ్రీసర్వదేవర పరంజ్యోతి మానవ సేవా దేవాలయంలో ఆదివారం పరంజ్యోతి మానవ సేవా సమితి సభ్యులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంలో మానవ సేవా సమితి మహిళా సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, సేవకులు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలను పూలమాలలతో సత్కరించిన పరంజ్యోతి మానవ సేవా సమితి సభ్యులు తదితరులు